# ఛాలెంజ్ చెయ్యని ఓటు

హితశ్రీ

తాలూకా ఆఫీసు కలకల్లాడుతోంది.

లారీలూ, జీపులూ ఆఫీసు ఆవరణలోకి హడావుడిగా వస్తున్నాయి.మళ్లీ రయ్యిన వెడుతున్నాయి.

ఎవరెవరో చేతుల్లో ఫైళ్లతో అటూ ఇటూ తిరుగుతున్నారు. ఎడతెగకుండా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఉత్తరువులు అర్జంటుగా జారీ అవుతున్నాయి.

పోలీసులు వాన్‌లో ఎక్కబోతూ దర్జా వెలిగిస్తున్నారు.

అదంతా లోక్‌సభ ఎన్నికల సంరంభం.

ఆ రోజే పోలింగ్.

ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలోని ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోటానికి సంబర పడుతున్న వేళ.

సూర్యుడు కూడా ఉత్సాహంగా భారతాకాశంలో వి.ఐ.పి.లా విహరిస్తూ, పరిశీలకుడుగా విచ్చేయసాగాడు.

ఓటు వెయ్యటం ఓ సరదానో, ఓ బాధ్యతో, ఓ విధో, ఓ తప్పనిసరి చర్యో ఏమోగాని ఆ చుట్టుపక్కల ఉన్న బూత్‌ల వైపు జనం బారులుగా త్వరత్వరగా వెడుతున్నారు.

తాలూకాఫీసులో వరండాలో ఓ మూల కుర్చీలో కూర్చొని నేను ఇదంతా వేడుకగా చూస్తున్నాను.

నాకూ ఆ రోజు డ్యూటీ వుంది. ఓట్లు వేయించే డ్యూటీ. ప్రిసైడింగ్ ఆఫీసర్ అన్నమాట. అయితే రిజర్వ్‌లో వున్నాను.

"సార్ నాకేమైనా డ్యూటీ వుందా?" అన్నాను ఉదయమే రిటర్నింగ్ ఆఫీసర్‌గార్ని కలుసుకొని.

"ఏ పోలింగ్ స్టేషన్ నుంచైనా కబురొస్తుందేమో. కాసేపు వెయిట్ చెయ్యండి మాస్టారూ" అన్నాడాయన.

బహుశా, నాకు డ్యూటీ వుండకపోవచ్చనుకుని పేపరు చూస్తూ, వచ్చే పోయే ట్రాఫిక్ చూస్తూ కాలం గడుపుతున్నాను.

పోలింగ్ ప్రారంభమై గంటయిపోయింది.

ఏమీ తోచక కుర్చీలోంచి లేచి పచార్లు చేస్తూ రిటర్నింగ్ ఆఫీసర్ రూం దాకా వచ్చాను. అది సమయంలో ఆవరణలోకి ఓ జీప్ దూసుకొచ్చింది. అందులోంచి మా గ్రూప్ ఆఫీసర్ దిగి, ఆదరాబాదరాగా నా వైపు వస్తూ నన్ను చూసి ఆగాడు.

"అమ్మయ్య, మీరున్నారు గదా!" అన్నాడు ఎంతో రిలీఫ్‌తో.

"ఏం సార్ ఏమైనా స్టాఫ్ కావలసి వచ్చారా?"

"ఔను. డెయిరీ ఫారం దగ్గిర బూత్‌లో పి.ఓ.గారికి ఒంట్లో బాగాలేదు. బి.పి. వచ్చింది. పని చాలా మందకొడిగా సాగుతోంది. ఆయన్ని రిలీవ చెయ్యాల. మీరొస్తారా? లేక, ఇంకెవరినైనా—"

"వస్తాను సార్, నాకిక్కడేం తోచటం లేదు. పదండి" అన్నాను.

"ఆఫీసర్‌గారితో చెప్పి ఇప్పుడే వస్తాను జీప్‌లో కూర్చోండి" అని ఆయన లోపలికి రిటర్నింగ్ ఆఫీసర్ గదిలోకివెళ్లి ఓ అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చి జీప్ ఎక్కాడు. జీప్ వెంటనే బయలుదేరింది.

"ఎంత ఓ పావుగంటలో వెళ్లిపోతాం" అన్నాడు గ్రూప్ ఆఫీసర్ వాచ్ చూసుకుంటూ.

"జనం ఎక్కువగా వున్నారా?"

"ఔనండీ. బొత్తిగా సాగటం లేదు. చాలామంది వెయిట్ చేస్తున్నారు. గందరగోళంగా వుంది."

"ఫరవాలేదులెండి. నేను చురుగ్గా చేసేస్తాను. అలవాటే గదా" అన్నాను అతనికి కొంచెం అభయమిస్తున్న ధోరణిలో.

"ఇంతటితో అయిందా. ఇంకెం అవాంతరాలొస్తాయో, ఎక్కడొస్తాయో! ఈ రోజంతా మాకీ హడావుడి తప్పదు" అన్నాడు ఆయన ఫైలు చూసుకుంటూ.

"సార్ మనలో మాట, ఛాన్సెస్ ఎలా వున్నాయంటారు మీ ఏరియాలో?" అన్నాను కుతూహలం కొద్దీ.

"మనకేం రాజకీయాల్లేవనుకోండి. అయినా నేను విన్నదాన్నిబట్టి, చూసిందాన్నిబట్టీ ఇక్కడ కాంగ్రెస్ ఐకీ, తెలుగుదేశానికీ బాగా పోటాపోటీగానే వుంది.ఎవరు నెగ్గుతారో చెప్పటం కష్టం" అన్నాడాయన కొంచెం తాపీగా, జాగ్రత్తగా.

"అలాగా! ఎవరొస్తే మనకేంలెండి!" అన్నాను అనాసక్తితో.

"అంతేకదా. ఎవరో ఒకరే కదా నెగ్గేది. ఎంత పోటాపోటీ అయినా."

"ఒకవేళ ఇద్దరూ నెగ్గితే?"

"చస్తాం" అన్నాడాయన అప్రయత్నంగా.

"ఏం?" అన్నాను నవ్వుతూ.

"అహ, ఇద్దరికీ సమంగా ఓట్లొస్తే?"

"మళ్లీ లెక్కపెడతారు. కౌంటింగ్‌లో మాకు డబుల్ డ్యూటీ."

"మళ్లీ అలాగే వస్తే?"

"మళ్లీ ఎలెక్షన్ పెడతారేమో."

"చచ్చాం. లాటరీ వెయ్యరా?" అన్నాడాయన కొంచెం భయంగా.

"ఏమో. రూల్స్ చూడాలి" అన్నాను నవ్వుతూ. "అయినా మీకంటె నాకేం తెలుసు. మీకివన్నీ అనుభవమే కదా!" అని అతని వైపు చూశాను.

"ఏం అనుభవమో. ఈ ఎలెక్షనయేదాకా నాకింకేదీ గుర్తుండదు."

"బాధ్యత అలాంటిది" అని సానుభూతిగా అన్నాను.

ఇంతలో మేం వెళ్లాలిసిన పోలింగ్ స్టేషన్ వచ్చింది. ఇద్దరం జీప్ దిగి సరాసరి పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లాము. పి.వో.గారికి మమ్మల్ని చూడగానే ముఖం చాటంత అయింది. ఆయన్ని రిలీవ్ చేసి, నేను ఛార్జి తీసుకున్నాను.

బయట జనం చాలామంది క్యూలో వున్నారు. క్యూ ఎంతకీ కదలక పోవటంతో విసుగుతో తోసుకొస్తూ కేకలేస్తున్నారు. లోపలివాళ్ళు బయటివాళ్లని వెనక్కి నెడుతున్నారు. తలుపు దగ్గిర అదుపుచేసే వ్యక్తికి వల్ల కావటం లేదు. అంతా గందరగోళంగా వుంది. ఎ.పి.ఓ. చదివే ఓటర్ల పేర్లు వినపడక ఏజెంట్లు మళ్లీ మళ్లీ అడగటంతో ఇంకొంచెం ఆలస్యం జరుగుతోంది. తొక్కిడిలో ఎవరి వేలికి మార్కింగ్ వేశారో ఎవరికి బాలెట్ పేపర్ ఇవ్వాలో తెలీక తికమక పడటం జరుగుతోంది. అస్వస్థుడుగా వుండటం వల్ల పి.ఓ. స్వయంగా కలుగజేసుకొని అదుపు చెయ్యలేపోతున్నాడు. ఇదీ అక్కడి పరిస్థితి.

పోలింగ్ త్వరగాజరగాలంటే అక్కడ వున్న ఓటు మార్క్ చేసే కంపార్ట్‌మెంట్ ఒక్కటే సరిపోదు.

ఇంకోటి కావాలి. అక్కడ వెంటనే ఇంకో బల్ల కావాలంటె దొరకదు. అందువల్ల పి.ఓ. టేబిల్ అక్కడి ఉద్యోగి దగ్గర వున్న దుప్పటి ఓటి చుట్టూకట్టి ఇంకో కంపార్ట్‌మెంట్ తయారుచేశాం. కర్రలు కట్టటానికి పురికొస లేకపోతే ఆ ఆవరణలో వున్న ఈత చెట్ల దుబ్బుల్లోంచి ఈతాకులు కోసి కట్టాం.

ఆ తర్వాత క్యూ క్రమబద్ధం చేసి పోలింగ్ త్వర త్వరగా జరిగిపోయే ఏర్పాటుచేశాం.

ఆ జనసందోహం చూస్తుంటే నాకెంతో సంతోషం కలిగింది. వయసులో వున్నవాళ్లేకాదు, కర్ర మూడో కాలయినవాళ్లు, కన్ను కనిపించనివాళ్లు, కనిపించీ కనిపించని వాళ్లు, పిల్లలు తోడైనవాళ్లు, పిల్లలు బుజాల మీదున్న వాళ్లు, ఉత్సాహం ఉరకలు వేస్తుంటే చకచక నడిచేవాళ్ళు, నడవలేక నడిచేవాళ్ళు, అన్ని అవయవాలూ సరిగా లేనివాళ్లు ఆడ, మగ అంతా "పదండి ముందుకు" అంటూ ముందు ముందుకి ఓటు వెయ్యటానికి వస్తుంటే—జనవాహిని ఉప్పెనగా ముందుకి విరుచుకు పడుతుంటే— ప్రజాస్వామ్యం జండా రివ్వున ఆకాశంలోకి ఎత్తుగా రెపరెపలాడుతూ దూసుకుపోతున్నట్టనిపించింది.

బేలట్ వుంటే బులెట్ ఎందుకు?

జనం వస్తున్నారు.

ఓటు వేస్తున్నారు.

వెళ్లిపోతున్నారు.

మానవుడు ఎంత నాగరికుడయాడు! ఎంత సంస్కారవంతుడయాడు! ఎంత సహజీవనుడయాడు!

నాలో ఇలా ఏవేవో ఆలోచనలు రేగాయి. ఏదో సంతృప్తి మనసంతా ఆవరించింది.

సాయంకాలం అవుతోంది. ఇంకో అరగంటలో పోలింగ్ సమాప్తి అవుతుంది. సరిగా ఆ సమయంలో ఓ అల వచ్చినట్టుగా కొందరు ఓటువెయ్యటానికి వచ్చారు. ఇలా చివరిదాకా జనం వస్తున్నందుకు నాకూ చాలా సంతోషం వేసింది. అప్పటికే చాలా బాగా పోలైంది.

ప్రజాస్వామ్యం ఘనవిజయం పొందుతోంది.


యథాలాపంగా ఓటు వెయ్యటానికి వస్తున్న జనం వైపు చూస్తూ కూర్చున్నాను. వాళ్లు చీట్లు ఎ.పి.ఓ.గారికి ఇస్తున్నారు. ఆయన పేర్లు చదువుతున్నాడు. వాళ్ళు అవునంటున్నారు. ఏజెంట్లు నోట్ చేసుకొంటున్నారు. ఉద్యోగులు వేలికి ఇన్‌డెలిబుల్ ఇంక్‌తో గుర్తుపెడుతున్నారు; బాలెట్ పేపర్లు ఇస్తూన్నారు; వాటి మీద ఎలా గుర్తు వెయ్యాలో వివరిస్తున్నారు. ఓటర్లు బేలట్ పేపర్లు తీసుకువెళ్లి కంపార్ట్‌మెంట్‌లో గుర్తువేసి తెచ్చి బాలెట్ బాక్స్‌లో వేస్తున్నారు. అంతా యాంత్రికంగా జరిగిపోతోంది.

ఉన్నట్టుండి నేను ఉలిక్కిపడ్డాను.

"సార్, ఈ కేసు మీరుచూడండి" ఏ.పి.ఓ.గారు ఓ యువకుణ్ణి నా దగ్గరికి పంపిస్తూ అన్నారు.

"ఆ!" అన్నాను.

"ఈ కేసు మీరు చూడండి. అతను చెప్పే దాంట్లో తేడా వుంది" అన్నాడు ఏ.పి.ఓ. నేను తెప్పరిల్లి ఆ యువకుడి వైపు చూశాను. అతనిచ్చిన చీటీ చూశాను. నా దగ్గరి ఓటర్ల లిస్ట్‌లో వెతికాను.



"పేరు?" అడిగాము మృదువుగా.

"వెంకా వెంకటేశం" అతను నోరు విప్పాడు. నేను చెయ్యి అడ్డం పెట్టుకున్నాను.

"తండ్రి పేరు."

"రామయ్య."

"ఇందులో వెంకయ్య అని వుంది."

"తప్పు వేసి వుంటారు" అతను నాలిక కొరుక్కొన్నాడు.

"వయస్సు?"

"ఇరవై మూడు."

అతని వైపు నిశితంగా చూశాను. కొంచెం నల్లగా వున్నాడు. పొడుగు గిరజాల జుట్టు. చదువుకొన్న కళ లేదు. పనుల్లో ఆరితేరిన మనిషిలా కూడా లేదు. కాని డబ్బున్న వ్యక్తిలా కనిపించాడు. ఖరీదైన పాంట్, షర్ట్, గోల్డ్ చైన్, ముప్పయిరెండు ముప్పయి మూడేళ్లకి తక్కువ వయసుండదు. నడిమంత్రపు సిరి అబ్బిన లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఇరవై మూడా?" అన్నాను అపనమ్మకంతో.

"అవును" అన్నాడతను దృఢంగా.

"ఇంట్లో ఇంకా ఇతరుల పేర్లు చెప్పండి."

అతనేవో చెప్పాడు, అవి లిస్టులో వున్నాయి.

"మీకు ఇక్కడ ఎవరైనా తెలుసా?"

"వీళ్లంతా నన్నెరిగినవాళ్లే" అన్నాడతను నవ్వుతూ నిర్లక్ష్యంగా చెయిన్ అక్కడివాళ్ల వైపు విసురుతూ.

కొంతమంది ఒకరి వైపు ఒకరు చూసుకోటం గమనించాను.

"ఏమండీ, ఇతన్ని ఎవరన్నా గుర్తుపడతారా?"

ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"ఆళ్లు గుర్తుపట్టేదేంటి సార్? ఎవరికన్నా అభ్యంతరం వుందేమో అడగండి—ఏజెంట్లని" అన్నాడతను కొంచెం దురుసుగా.

"ఏమండీ మీకేమైనా అభ్యంతరమా?" అన్నాను ఏజెంట్ల వైపు చూస్తూ.

వాళ్లు తలలు అడ్డంగా తిప్పారు.

"మీకు ఈయన తెలుసా?"

వాళ్లు మౌనం వహించారు.

"మీకు ఇరవై మూడేళ్లంటే నమ్మటం కష్టం."


"అదేంటి సార్, కొంతమంది రివటల్లా ఎదిగి పోతారు. కొంతమంది రింగాల్లా కుదించుకు పోతారు. నమ్మనంటారేంటి?" అన్నాడు గట్టిగా.

"మీరుఫలానా అని తెలిసినవాళ్లెవరో చెప్పండి."

"తెలీకపోటమేంటి? ఈ ఊళ్లో నన్నెరగని వాళ్లున్నారేంటసలు? ఎవర్ననుకొంటున్నారు? అరే రాజా, శివా చెప్పండ్రా, నేను వెంకటేశం కానంట. చెప్పండ్రా ఆఫీసర్‌గారికి" ఆజ్ఞాపిస్తున్నట్టుగా అన్నాడతను.

"వెంకటేశమేనండి ఈయన. ఇచ్చెయ్యండి బాలెట్ పేపరు బాబు" అన్నారు ఇద్దరు ముగ్గురు.

నాకేం చెయ్యాటానికీ తోచలేదు.అతన్నిచూస్తే ఇది దొంగఓటేననిపిస్తోంది. కాని అతనువెంకటేశం కాదని ఎవరూ అనలేదు. ఏజెంట్లు అభ్యంతరం చెప్పలేదు. ఓసారి అక్కడున్న వాళ్లందరి ముఖాలూ చూశాను. కొందరు పెద్దవారున్నారు. కొందరు నడివయసు




వాళ్ళున్నారు. కుర్ర వాళ్ళసంగతిఎలావున్నా అబద్ధమైతే వాళ్ళైనా చెప్తారా? వాళ్ళ ముఖాల్లోకి తరచి తరచి చూశాను. వాళ్లు ఏమీ మాట్లాడకుండా తలలు తిప్పుకుని వాళ్ల పనిలో వాళ్లు నిమగ్నులైనట్టు బాలెట్ పేపర్లు తీసుకొని వెళ్లి గుర్తులు వేస్తున్నారు. సరే. వాళ్లెవరికీ లేని ఆసక్తి నాకెందుకు?

"ఏ.పి.ఓ.గారూ, ఈయనకి బాలెట్ పేపర్ ఇవ్వండి."

"అతను ముసిముసిగా నవ్వుకుంటూ బేలట్ పేపరు తీసుకుని ఓటువేసి వెళ్ళిపోయాడు.

పోలింగ్ టైమైపోయింది. బాలట్ బాక్స్‌లు సీలు వేశాము.

పూర్తిచెయ్యాలిసిన ఫారాలు పూర్తిచేశాను. కవర్లలో పెట్టి సీలువేశాము.

పోలింగ్ జయప్రదంగా జరిగినందుకు స్వేచ్ఛగా గాలి పీల్చుకొన్నాము. బాలట్ బాక్స్‌లుతీసుకువెళ్లే లారీ రావటానికివాలా టైం పడుతుంది. ఈ లోగా కాస్త కాఫీ తాగి రావాలనిపించింది. అక్కడికి రెండు ఫర్లాంగులు మెయిన్‌రోడ్ మీదికి వస్తేగాని కాఫీ హోటలేం లేదు. ఆ సామాన్లు ఎ.పి.ఓ.గారికి వప్పచెప్పి హోటల్‌కి బయలుదేరాను.

హోటల్లో అడుగుపెట్టీ పెట్టగానే తుళ్లిపడ్డాను.నాకు ఎదుర్గుగా బల్లమీద కూర్చుని వెంకటేశం అని చెప్పి ఓటువేసిన వ్యక్తి తీరిగ్గా కాఫీ సేవిస్తున్నాడు. హోటల్లో ముగ్గురు నలుగురి కంటె లేరు.

"రండి సార్, ఆఫీసర్‌గారూ" అంటూ అతను నన్ను చూసి చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"థాంక్స్" అంటూ అనుమానిస్తూ అతని పక్కన కూర్చున్నాను. అతనునాకు టిఫిన్, కాఫీ ఆర్డరిచ్చాడు.

"అంతా బాగా జరిగిందా సార్?"

"ఆ బాగానే జరిగింది" అన్నాను. అతనితో సంభాషణ నాకిష్టంలేదు. నాకు టిఫిన్, కాఫీ ఆర్డరిచ్చినందుకు నాకు చాలా ఇబ్బందిగా వుంది. ఏమైనా బిల్లు ఇతన్ని ఇవ్వనివ్వకూడదు.

"సార్ మీదే ఊరు?"

"మా ఊరుకాదు" అన్నాను తెచ్చిపెట్టుకొన్న హాస్యంతో.

"అది తెలుస్తూనే వుంది కదా సార్."

నాకేదో అసహనంగా వుంది. ఇతని దగ్గర నిజం తేల్చుకోవాలనీ, అతనిచేత అది ఒప్పించాలనీ ఎందుకో పట్టుదల కలిగింది.

"చూడండి, ఇప్పుడు పోలింగ్ ఐపోయింది. నిజం చెబితే నష్టం లేదు ఇంక. మీ పేరు నిజంగా వెంకటేశమేనా?"

"ఏంటంటా కాకపోతే?" అని అతనునావైపుచిరాగ్గా చూశాడు. అతను నన్నవమానించాలని అలా ఏకవచన ప్రయోగం చెయ్యలేదు. అతని మాట తీరే అంత. సంభాషణ కొంచెం లోతుగా పోతే ఇంక పరిసరాలు, మర్యాదలు అలాంటివాళ్లకి గుర్తుండవు.

"అయితే మీరునిజంగా దొంగ ఓటు వేశారన్న మాట."

"ఏంటంటా వేస్తే?"

"ఏముందీ, ఏం లేదు" అన్నాను నేను విషాదంగా.

"అదున్నవాళ్ళలో నా పేరుకొండ్రావని ఎవరికి తెలీదు? ఆళ్లేమన్నా, కనీసం ఒక్కడైనా నన్ను నిల దీశాడా? ఆళ్లదేం పోయె? నేను దొంగ ఓటు వేస్తే ఏంటంట? ఆళ్ల జేబుల్లోంచి నేనేం కొట్టెయ్యలేదే, మా ఊరోడు ఇంకోడి ఓటేసుకొన్నాడులే మందేం పోయింది. అడికీ ఊళ్లో ఓటు లేదు మరి, అనుకొని నోళ్లు మూసుకున్నారు. మధ్యలో మీదేం పోయింది సార్?" అన్నాడు కొంచెం ఉద్రేకంగా.

"ఏజెంట్లు కూడా ఛాలెంజి చెయ్యలేదే, చిత్రం" నాలోనేను అనుకొన్నట్లు అన్నాను.

"ఛాలెంజి చెయ్యటానికి ఆళ్లకి నాతోపన్లేం లేవేంటి."

"ఓహో!" అన్నాను కొంచెం వ్యంగ్యంగా.

"అవున్సార్!"

"అన్యాయం."

"ఏంటంట అన్యాయం? నాకు ఓటు లేదుకనుక ఎక్కడిదో ఓటేసుకొన్నా. నాకు డబ్బు లేదు కనుక ఎట్టాగో సంపాయించుకున్నా. ఎట్లాగని అడగబోక. స్కూటరు లేదు గనుక స్కూటరు కొనుక్కున్నా. ఎట్టాగని అడగబోక. నాకు పవరు లేదు కనుక పవరు సంపాయించుకొన్నా. ఎట్లాగని అడగబోక. ఏంటంట అన్యాయం. అన్యాయమైతే, అరేయ్! అని ఆళ్లలో ఒక్కడైనా నన్ను నిలదియ్యడా? మరింకేంటంట అన్యాయం?" అన్నాడు వెంకటేశం అవతారం చాలించిన కొండ్రావు. నాకేమనటానికీ నోరు పెగల్లేదు.ఇంతలో మా గ్రూప్ ఆఫీసర్‌గారి జీపు వస్తున్న ధ్వని వినిపించింది.

అతను వద్దంటున్నా బిల్లు చెల్లించి చప్పున బయట పడ్డాను. ●